
Toli Velugu 30.01.26_Layout 1 1/30/2026 7:02 AM Page 1

# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..




నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 22 | పేజీలు : 4 | శుక్రవారం 30 జనవరి 2026 | వెల : 2/-

# ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు..

## శుక్రవారం విచారణకు రాలేనంటూ సిట్‌కు కేసీఆర్ రిప్లయ్



- నోటీసుల నేపథ్యంలో సిట్‌కు ప్రత్యుత్తరం రాసిన కేసీఆర్
- రేపు మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు చివరి రోజు అన్న కేసీఆర్
- ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తానని వెల్లడి
- కేసీఆర్‌కు సమయం ఇవ్వాలని సిట్ నిర్ణయం
- ఫామ్ హౌస్‌లో విచారించాలన్న విజ్ఞప్తిపై న్యాయసలహా తీసుకోనున్న సిట్
- తదుపరి విచారణ తేదీతో శుక్రవారం మరోసారి నోటీసులు..?

డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు విచారణకు రావాలని తనకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఈ మేరకు సిట్‌కు ఆయన సమాధానం ఇచ్చారు. తాను శుక్రవారం విచారణకు రాలేనని, శుక్రవారమే మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీ అని అందులో ప్రస్తావించారు. అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉందని తెలిపారు. విచారణకు మరో రోజు కేటాయించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా తాను విచారణకు సహకరిస్తానని పేర్కొన్నారు. అలాగే తనను ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లోనే విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. 160 సీఆర్పీసీ కింద విచారణను ఒకే ప్రాంతంలో చేయాలనే నిబంధన లు ఏమీలేవని గుర్తు చేశారు. భవిష్యత్తులో నోటీసులను ఎర్రవల్లికే పంపించాలని ఆ లేఖలో కోరారు.

**కేసీఆర్ అభ్యర్థనకు అంగీకరించిన సిట్... కానీ..!**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా తాను విచారణకు హాజరు కాలేనన్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభ్యర్థనకు సిట్ అంగీకరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ కోసం కేసీఆర్‌కు మరింత సమయం ఇవ్వాలని నిర్ణయించింది. అయితే కేసీఆర్ లేవనెత్తిన పలు అంశాలపై సిట్ న్యాయ సలహా తీసుకోనుంది. సలహా తీసుకున్న అనంతరం తదుపరి తేదీ, విచారణ చేసే ప్రాంతాన్ని పేర్కొంటూ సిట్ మరోసారి నోటీసులు జారీ చేయనుంది. శుక్రవారం తదుపరి విచారణ తేదీని ప్రకటించే అవకాశం ఉంది.

ఇది విచారణ కాదు...

# ప్రతీకారం

## - కేసీఆర్‌కు సిట్ నోటీసులపై కేటీఆర్ ఫైర్

- కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం కక్ష సాధింపేనన్న కేటీఆర్
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఈ చర్యలని ఆరోపణ
- చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణ సాధించారని వ్యాఖ్య
- బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరపలేరని హెచ్చరిక
- కాంగ్రెస్ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తామని ప్రకటన



డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది విచారణ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న రాజకీయ ప్రతీకార చర్య అని ఆయన అభివర్ణించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్, పాలనా లోపాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ఇది కేవలం న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని, రాజకీయ దురుద్దేశంతోనే ఈ నోటీసులు ఇచ్చారని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ.. "చావు నోట్లో ....

2

# మేడారంలో మొక్కులు చెల్లించుకున్న కేంద్ర మంత్రులు

- మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను సందర్శించిన కేంద్ర మంత్రులు
- గద్దెలపై నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న ఓరం, కిషన్ రెడ్డి
- గిరిజనుల మహా కుంభమేళా ఈ జాతర అని అభివర్ణించిన జువల్ ఓరం
- రూ.890 కోట్లతో సమ్మక్క-సారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు
- గిరిజన అభివృద్ధి, సంక్షేమానికి కేంద్రం పూర్తి మద్దతు ఇస్తుందని వెల్లడి



డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరను కేంద్ర మంత్రులు గురువారం సందర్శించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరం, బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద వారికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాదర స్వాగతం .....

2




- డ్యామ్‌ల భద్రతపై పార్లమెంటులో టీడీపీ ఎంపీల ప్రశ్న
- అత్యంత ప్రమాదకరస్థితిలో మేడిగడ్డ, లోయర్ ఖజురి, బొకారో డ్యామ్‌లు
- వెల్లడించిన కేంద్ర జలశక్తి శాఖ

2

# వీధికుక్కల సమస్య..

## తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు

- వీధి కుక్కల నిర్వహణ... సుప్రీంకోర్టులో విచారణ
- విచారణలో అన్ని వర్గాల వాదనలు విన్న త్రిసభ్య ధర్మాసనం
- కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రాల సంఖ్యపై తప్పుడు లెక్కలున్నాయని ఆందోళన
- కుక్కలను షెల్టర్లకు తరలించాలన్న గత ఆదేశాలను సవరించిన ధర్మాసనం



2

# కేసీఆర్‌ను టచ్ చేస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్టే

## - సిట్ నోటీసులపై హరీశ్ రావు ఫైర్

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు సిట్ నోటీసులు

సిట్ నోటీసులు రాజకీయ కక్ష సాధింపు చర్యేనని హరీశ్ రావు ఆగ్రహం

సింగరేణి కుంభకోణం నుంచి దృష్టి మరల్చేందుకే ప్రభుత్వ కుట్ర అని విమర్శలు

మున్సిపల్ ఎన్నికల్లో లబ్ది పొందేందుకే ఈ చౌకబారు రాజకీయం అంటూ ట్వీట్

ప్రభుత్వ వేధింపులకు భయపడం, ప్రజలే కాంగ్రెస్‌కు బుద్ధిచెబుతారని హెచ్చరిక

2



# హైదరాబాద్‌లో హైడ్రా కొరడా

## - జూబ్లీహిల్స్ 'నీరూస్'కు తాళాలు

- అగ్నిమాపక నిబంధనలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా
- జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ నీరూస్ షోరూంను సీజ్ చేసిన అధికారులు
- నాంపల్లిలో మరో ఫర్నిచర్ షోరూంకు కూడా..
- నాంపల్లి దుర్ఘటన తర్వాత తనిఖీలు ముమ్మరం
- ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలని ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి

2



Toli Velugu 30.01.26_Layout 1 1/30/2026 7:02 AM Page 2



# కేసీఆర్‌ను టచ్ చేస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్టే

## - సిట్ నోటీసులపై హరీశ్ రావు ఫైర్

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, ఈ కుతంత్రాలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. కేసీఆర్ తెలంగాణ జాతి పిత అని, కోట్లాది మంది ప్రజల ఆరాధ్య దైవమని, అలాంటి నాయకుడిపై బురద చల్లాలని చూడటం సూర్యుడిపై ఉమ్మి వేయడమేనని వ్యాఖ్యానించారు. పాలనలో తమ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ముఖ్యంగా సింగరేణి బొగ్గు కుంభకోణం మరకల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సిట్ పేరుతో నోటీసుల డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ఠ అని దుయ్యబట్టారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూడటం రేవంత్ రెడ్డి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్ద కాలంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్ అని హరీశ్ రావు కొనియాడారు. కేసీఆర్ చరిత్రను సృష్టిస్తే, ఆ చరిత్రను మలినం చేసేందుకు రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని, అహంకారం అంతకంటే కాదని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ సమాజం మొత్తం కేసీఆర్ వెంటే ఉందని, ప్రభుత్వ రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హరీశ్ రావు హెచ్చరించారు.

# ఇది విచారణ కాదు... ప్రతీకారం

## - కేసీఆర్‌కు సిట్ నోటీసులపై కేటీఆర్ ఫైర్

మొదటిపేజీ తరువాయి..
తలపెట్టి, సచ్చుడో, తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని దీక్షతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన మహానాయకుడు కేసీఆర్. తన పదేళ్ల పాలనలో మిషన్ భగీరథ, రైతుబంధు, దళితబంధు వంటి పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారు. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని చూసుకున్నారు. అలాంటి నాయకుడిపై అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు విచారణల పేరుతో వేధించడం దుర్మార్గం" అని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నందుకే బీఆర్ఎస్ అధినేతపై కాంగ్రెస్ కక్ష కట్టిందని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, కేవలం నోటీసులు ఇచ్చి, బెదిరింపులకు పాల్పడి తెలంగాణ ఉద్యమ చరిత్రను, ఆయన కీర్తిని చెరిపేయలేరని హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించేది లేదని, ప్రజలే సరైన సమయంలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఈ కక్ష సాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తోందని, ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ అన్యాయ పాలనపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కేటీఆర్ ఉద్ఘాటించారు. చరిత్రను విచారణలతో కాదని, ప్రజల తీర్పుతోనే రాస్తారని ఆయన వ్యాఖ్యానించారు.

# మేడారంలో మొక్కులు చెల్లించుకున్న కేంద్ర మంత్రులు

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరను కేంద్ర మంత్రులు గురువారం సందర్శించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరం, బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద వారికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాదర స్వాగతం పలికారు. గిరిజన డప్పు వాయిద్యాల మధ్య ఆలయంలోకి ప్రవేశించిన కేంద్ర మంత్రులు, గద్దెలపై 'నిలువెత్తు బంగారం' సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం జువల్ ఓరం మీడియాతో మాట్లాడుతూ, సమ్మక్క - సారలమ్మ జాతర గిరిజనుల మహా కుంభమేళా అని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు, 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఇక్కడికి రావడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని, పీఎం జన్‌మన్ పథకం కింద రూ. 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య పాఠశాలలు కేటాయించినట్లు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, జాతర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ ప్రాంత పర్యాటక అభివృద్ధికి రూ. 80 కోట్లు, రామప్ప ఆలయానికి రూ. 40 కోట్లు, జాతర ఏర్పాట్లకు ఈ ఏడాది రూ. 3.70 కోట్లు కేటాయించినట్లు వివరించారు. మేడారంలో సమ్మక్క - సారలమ్మ పేరుతో రూ. 890 కోట్ల వ్యయంతో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. త్వరలోనే ప్రధాని ఈ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభిస్తారని ఆయన స్పష్టం చేశారు.









# దేశంలోని అత్యంత ప్రమాదకరస్థితిలోని మూడు డ్యామ్‌లలో మేడిగడ్డ



మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : తెలంగాణ రాష్ట్రంలోని మేడిగడ్డ డ్యామ్ అత్యంత ప్రమాదకరస్థితిలో ఉందని కేంద్ర జల్‌శక్తి శాఖ వెల్లడించింది. డ్యామ్‌ల భద్రతపై టీడీపీ ఎంపీలు లక్ష్మీనారాయణ, శబరి పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. ఈ క్రమంలో మేడిగడ్డతో పాటు దేశంలోని వివిధ ప్రాజెక్టులపై కీలక సమాధానం ఇచ్చింది. దేశంలో 50 ఏళ్లకు పైబడిన డ్యామ్‌లు 1,681 ఉన్నాయని జల్‌శక్తి శాఖ తెలిపింది. గత సంవత్సరం వర్షాకాలం కంటే ముందు 6,524 డ్యామ్‌లు తనిఖీ చేశామని కేంద్రం వెల్లడించింది. వర్షాకాలం అనంతరం మరో 6,553 డ్యామ్‌లు తనిఖీ చేసినట్లు తెలిపింది. ఈ తనిఖీలలో మూడు డ్యామ్‌లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నట్లు వెల్లడైందని పేర్కొంది. వాటిలో తెలంగాణలోని మేడిగడ్డ, ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజురి, ఝార్ఖండ్‌లోని బొకారో డ్యామ్‌లు ఉన్నట్లు వెల్లడించింది. మేడిగడ్డ డ్యామ్‌కు సంబంధించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు జల్‌శక్తి శాఖ తెలిపింది.

# హైదరాబాద్‌లో హైడ్రా కొరడా

## - జూబ్లీహిల్స్ 'నీరూస్'కు తాళాలు

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : హైదరాబాద్ నగరంలో అగ్నిమాపక భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఉక్కుపాదం మోపింది. ఇటీవల నాంపల్లిలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసిన అధికారులు.. గురువారం జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ వస్త్ర దుకాణం 'నీరూస్' తో పాటు నాంపల్లిలోని మరో ఫర్నిచర్ షోరూంను సీజ్ చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో హైడ్రా, జీహెచ్‌ఎంసీ, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లోని నీరూస్ షోరూంలో తనిఖీ చేయగా తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడ్డాయి. మూడు సెల్లార్లు, నాలుగు అంతస్తులతో పాటు, అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన రూఫ్ షెడ్‌లో కూడా భారీగా వస్త్రాలను నిల్వ ఉంచడాన్ని అధికారులు గుర్తించారు. ఫైర్ సేఫ్టీ ఎన్వోసీ లేకపోవడం, మంటలను ఆర్పే పరికరాలు సరిగా లేకపోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం పై అంత-స్తులను గోదాముగా, వస్త్రాల తయారీ కేంద్రంగా మార్చడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. వెంటనే షోరూంను సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం అధికారులు నాంపల్లి స్టేషన్ రోడ్డులోని రహీమ్, మన్నన్ ఎస్టేట్స్ స్టాండర్డ్ ఫర్నిచర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఇటీవల ఐదుగురి మృతికి కారణమైన ప్రమాదం జరిగిన రోడ్డులోనే ఉన్నప్పటికీ ఈ షోరూంలో ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకపోవడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. ఆరు అంతస్తుల భవనంలో మెట్ల మార్గాన్ని కూడా మూసివేసి ఫర్నిచర్ నిల్వ ఉంచడం, కనీసం ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కూడా లేకపోవడంతో ఈ షోరూంను కూడా సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ రెండు షోరూంల వద్ద 'ఫైర్ అన్ సేఫ్' బోర్డులను ఏర్పాటు చేసి, హైడ్రా ఫెన్సింగ్ వేశారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నగరంలో ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘిస్తే, తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రజలను కోరారు. హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 9000113667 లేదా తన వాట్సాప్ నంబర్ 7207923085కు ఫొటోలు, వీడియోలతో సహా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.



# వీధికుక్కల సమస్య.. తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 29 (తొలివెలుగు) : దేశవ్యాప్తంగా వీధి కుక్కల నిర్వహణ, ప్రజల భద్రతకు సంబంధించిన సుమోటో కేసులో సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ), భారత జంతు సంక్షేమ బోర్డు (ఏడబ్ల్యూబీఐ) సహా అన్ని వర్గాల వాదనలను సుదీర్ఘంగా విన్న తర్వాత జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ నిర్ణయం తీసుకుంది. వారం రోజుల్లోగా తమ లిఖితపూర్వక వాదనలను సమర్పించేందుకు అన్ని పక్షాలకు సమయం ఇచ్చింది. విచారణ సందర్భంగా, వీధి కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రాల లెక్కల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని జంతు సంక్షేమ బోర్డు కోర్టు దృష్టికి తెచ్చింది. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందినవి 76 కేంద్రాలు మాత్రమే ఉండగా, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం 883 ఉన్నాయని నివేదికలు సమర్పించాయని తెలిపింది. ఈ లెక్కల్లోని తేడాలపై, నిధుల వినియోగంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. గుర్తింపు కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని జంతు సంక్షేమ బోర్డును ఆదేశించింది. ఈ సుమోటో విచారణలో భాగంగా కుక్కల ప్రేమికులు, కుక్కకాటు బాధితులు, జంతు హక్కుల కార్యకర్తల వాదనలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. యానిమల్ బర్త్ కంట్రోల్ నిబంధనల అమలు, ప్రజల భద్రత, కుక్కల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించడం వంటి అంశాలపై ఈ కేసు దృష్టి సారించింది. గతంలో, 2025 ఆగస్టులో జస్టిస్ జె.బి. పార్దివాలా నేతృత్వంలోని మరో ధర్మాసనం ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో వీధి కుక్కలన్నింటినీ వెంటనే పట్టుకుని షెల్టర్లకు తరలించాలని కఠిన ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఆ తీర్పుపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రస్తుత త్రిసభ్య ధర్మాసనం ఆ ఉత్తర్వులను సవరించింది. కుక్కలను తరలించే బదులు, యానిమల్ బర్త్ కంట్రోల్ నిబంధనల ప్రకారం వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసి తిరిగి అవే ప్రాంతాల్లో వదిలిపెట్టాలని స్పష్టం చేసింది. తాజాగా వాదనలు ముగియడంతో తుది తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

Toli Velugu 30.01.26_Layout 1 1/30/2026 7:02 AM Page 3



# 12వ వార్డు 'హస్తం' అభ్యర్థిగా పాక చిరంజీవి

- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మద్దతు.. కార్యకర్తల్లో ఉత్సాహం




చౌటుప్పల్, జనవరి 29 (తొలివెలుగు): చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పాక చిరంజీవి బరిలోకి దిగారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో ఆయన తన నామినేషన్‌ను ఖరారు చేసుకున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. తనకు మద్దతుగా నిలిచిన పార్టీ సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రత్యేక ప్రోత్సాహం అందించిన చౌటుప్పల్ రామాలయ చైర్మన్ బొబ్బిళ్ల మురళి కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వార్డు అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతానని ఆయన స్పష్టం చేశారు. వార్డులోని ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన ఎజెండా అని పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో పాటు పార్టీ శ్రేణుల ఐక్యతతో భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని చిరంజీవి ధీమా వ్యక్తం చేశారు.

# నామినేషన్ల స్వీకరణలో జాప్యం వద్దు

- చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



చౌటుప్పల్, జనవరి 29 (తొలివెలుగు): చౌటుప్పల్ మున్సిపాలిటీలో సాగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్ రావు గురువారం పర్యవేక్షించారు. మున్సిపల్ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి నామినేషన్ పత్రాన్ని నిశితంగా పరిశీలించాలని, ఎక్కడా జాప్యం జరగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కమిషనర్ గుత్తా వెంకట్రామిరెడ్డి, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, రెవెన్యూ అధికారి అంజయ్య, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఇతర మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి.. - జిల్లా కలెక్టర్ హనుమంతరావు

- చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ
- సీసీ కెమెరాల నిఘాలో నామినేషన్ల స్వీకరణ



చౌటుప్పల్, జనవరి 29 (తొలివెలుగు): చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండో సాధారణ ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిబంధనలకు లోబడి నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. హనుమంతరావు అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలు, సంబంధిత రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వార్డు వారీగా ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయనే వివరాలను రిటర్నింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ పత్రాలకు జతచేయాల్సిన ధ్రువపత్రాలు సరిగా ఉన్నాయా లేదా తనిఖీ చేయాలని, ఎక్కడా చిన్న పొరపాట్లకు కూడా తావులేకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. నామినేషన్లు దాఖలు చేసే ప్రతి అభ్యర్థికి సమాన అవకాశం కల్పిస్తూ, ఎటువంటి గందరగోళం లేకుండా ప్రక్రియను నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలని, పోలీసు బందోబస్తుతో శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆర్డీవో శేఖర్ రెడ్డికి సూచించారు. ఎన్నికల నివేదికలను ఎప్పటికప్పుడు టీ--పోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్, కంట్రోల్ రూమ్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు అభ్యర్థుల సౌకర్యార్థం అన్ని మౌలిక వసతులు కల్పించామని, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా సాగుతోందని తెలిపారు. ఈ తనిఖీలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య, ఇతర రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పైళ్ల రావాలి... పైళ్లే కావాలి

- భువనగిరిలో ఉవ్వెత్తున ప్రజా నినాదం
- రాజకీయ గాలులకు అతీతంగా పైళ్లే నినాదం
- భువనగిరిలో మళ్లీ మోగుతున్న పైళ్ల శేఖర్ రెడ్డి పేరు



భువనగిరి, జనవరి 29 (తొలివెలుగు): భువనగిరి నియోజకవర్గం మరోసారి రాజకీయంగా వేడెక్కుతోంది. అధికారం మారినా, రాజకీయ సమీకరణాలు తారుమారు అయినా ప్రజల హృదయాల్లో మాత్రం ఒకే పేరు బలంగా నిలిచింది. అదే పైళ్ల శేఖర్ రెడ్డి. కాలం మారినా భువనగిరి ప్రజల విశ్వాసం పైళ్ల శేఖర్ రెడ్డిపై ఏమాత్రం తగ్గలేదని తాజా రాజకీయ పరిణామాలు స్పష్టంగా సూచిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం ఎదురైనప్పటికీ, ప్రజల్లో పైళ్ల పట్ల ఉన్న ఆదరణ నేటికీ కొనసాగుతోంది. అభివృద్ధి దృక్పథం, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే నాయకత్వ శైలి ఇప్పటికీ ప్రజల జ్ఞాపకాల్లో సజీవంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించిన నాయకుడు పైళ్లేననే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో అధికారంలో లేకపోయినా మెజార్టీ స్థానాలు గెలుపొందడం, ప్రజల్లో ఆదరణ తగ్గలేదనే విషయాన్ని స్పష్టంగా చాటుతోంది. ఇది భువనగిరి రాజకీయాల్లో పైళ్ల శేఖర్ రెడ్డి ప్రభావం ఇంకా కొనసాగుతోందన్న సంకేతంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఒకే చర్చ నడుస్తోంది. "ఏ కష్టం వచ్చినా ఆదుకునే నాయకుడిని దూరం చేసుకున్నాం" అనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. పైళ్ల రావాలి... భువనగిరికి పునర్వైభవం రావాలి అనే నినాదం గ్రామగ్రామాన ప్రతిధ్వనిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పైళ్ల శేఖర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని ప్రజలు ముక్తకంఠంతో ప్రకటిస్తున్నారు. భువనగిరి రాజకీయాల్లో మరోసారి పెద్ద సంచలనం తప్పదన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల నామినేషన్లు

- భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు
- రాజకీయ గాలులకు అతీతంగా పైళ్లే నినాదం
- భువనగిరిలో మళ్లీ మోగుతున్న పైళ్ల శేఖర్ రెడ్డి పేరు



చౌటుప్పల్, జనవరి 29 (తొలివెలుగు): భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వివిధ వార్డుల్లో బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో భాగంగా రెండో వార్డు అభ్యర్థిగా పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య, మూడో వార్డు అభ్యర్థిగా రమణగోని దీపిక శంకరయ్య నామినేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడో వార్డు ఆంజనేయ స్వామి ఆలయం సమీపం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నాయకులు, చౌటుప్పల్ రామాలయంలో శ్రీరాముని ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం సుమారు 500 మంది మహిళలు, కార్యకర్తలతో కలిసి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇదే రోజు ఇతర వార్డుల్లోనూ బీజేపీ అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్, రమణగోని శంకరయ్య, ముత్యాల భూపాల్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, పోలోజు శ్రీధర్ బాబు, సురేందర్ రెడ్డి, ఉడుగు వెంకటేశం గౌడ్, దాసోజు బిక్షమాచారి, తడక సురేఖ, గోశిక నీరజ, వనం ధనంజయ, కడారి ఐలయ్య, ఎడ్ల మహేశ్వర్ రెడ్డి తదితర నాయకులు, పట్టణ ప్రముఖులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# హోరెత్తిన నామినేషన్ల పర్వం

- రెండో రోజు ముగిసిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ
- ప్రధాన పార్టీల పోటాపోటీ.. రెండో రోజు 59 దరఖాస్తులు
- వార్డుల వారీగా వివరాలు వెల్లడించిన కమిషనర్



చౌటుప్పల్, జనవరి 29 (తొలివెలుగు): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం నామినేషన్ల స్వీకరణ రెండో రోజు ముగిసింది. ఈ సందర్భంగా దాఖలైన నామినేషన్ల వివరాలను మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 20 వార్డులు ఉన్న చౌటుప్పల్ మున్సిపాలిటీలో గురువారం ఒక్కరోజే 59 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు.

వార్డు వారీగా: కమిషనర్ వెల్లడించిన వివరాల ప్రకారం 2వ వార్డులో అత్యధికంగా 6 నామినేషన్లు దాఖలయ్యాయి. 5వ, 10వ, 18వ వార్డుల నుంచి ఐదుగురు చొప్పున అభ్యర్థులు నామినేషన్లు వేశారు. 17వ వార్డులో గురువారం ఎటువంటి నామినేషన్లు దాఖలు కాలేదని తెలిపారు. మిగిలిన వార్డుల్లో ఒక్కో వార్డుకు 1 నుంచి 4 వరకు నామినేషన్లు స్వీకరించినట్లు పేర్కొన్నారు.

పార్టీల వారీగా:
దాఖలైన మొత్తం 59 నామినేషన్ లలో బీఆర్ఎస్ -- 16,కాంగ్రెస్ -- 15,బీజేపీ -- 15,సీపీఐ -- 5,ఇండిపెండెంట్లు -- 4,సీపీఎం -- 2, టిఆర్పి -- 2 అభ్యర్థుల నుంచి నామినేషన్లు దాఖలైనట్లు మున్సిపల్ కమిషనర్ వెల్లడించారు.




ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు.

## యాదాద్రి జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లో లోక్ దళ్ పార్టీ పోటీ

- మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమవుతున్న పార్టీ : గౌర బీరప్ప

చౌటుప్పల్, జనవరి 29 (తొలివెలుగు) : యాదాద్రి భువనగిరి జిల్లాలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో అన్ని మున్సిపాలిటీలలో రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ బరిలో నిలుస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు గౌర బీరప్ప తెలిపారు. గురువారం చౌటుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తమతో సంప్రదింపులు జరుపుతున్నారని, జిల్లాలో పార్టీ ఉనికిని బలంగా చాటడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ సాధికారత కల్పించడమే తమ పార్టీ ప్రధాన అజెండా అని గౌర బీరప్ప స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారైన నేపథ్యంలో అన్ని మున్సిపాలిటీలలో అభ్యర్థులను బరిలోకి దింపాలని నిర్ణయించినట్లు తెలిపారు. టికెట్ల కోసం పార్టీ నాయకులు, ఆశావాహుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ కోసం ఇప్పటికే జిల్లా స్థాయి నేతలకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. రెండు రోజుల లోపల దరఖాస్తులు సమర్పించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు తమ పూర్తి వివరాలను 9542632975 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని సూచించారు. అందిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అభ్యర్థులను అధికారికంగా ప్రకటిస్తామని గౌర బీరప్ప తెలిపారు.



## 13వ వార్డులో మార్పు కోసం.. చెరుకు స్వాతి నామినేషన్

- చిత్తశుద్ధితో పని చేస్తా.. ఆశీర్వదించండి!



చౌటుప్పల్, జనవరి 29 (తొలివెలుగు) : చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎన్నికల సమరంలో భాగంగా 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా చెరుకు స్వాతి శివకుమార్ గౌడ్ గురువారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. బీసీ మహిళకు రిజర్వ్ అయిన ఈ వార్డులో ఆమె ఉత్సాహంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చెరుకు స్వాతి మాట్లాడుతూ.. 13వ వార్డును అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. వార్డు ప్రజలు తనను ఆశీర్వదించి అవకాశం ఇస్తే, ప్రతి సమస్యపై స్పందిస్తూ పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండే కౌన్సిలర్‌గా పనిచేస్తానని స్పష్టం చేశారు. అనంతరం ప్రముఖ న్యాయవాది చెరుకు శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కొందరు అభ్యర్థులు ఇచ్చే మద్యం, నగదు వంటి ప్రలోభాలకు ఓటర్లు లొంగకూడదని సూచించారు. అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసే అభ్యర్థులను గుర్తించి ఓటు వేయాలని వార్డు ప్రజలను కోరారు. వార్డు ప్రజల సంపూర్ణ మద్దతుతో తమ విజయం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు.

## కౌన్సిలర్ అభ్యర్థిగా షేక్ జహీర్ నామినేషన్



సూర్యాపేట, జనవరి 29 (తొలివెలుగు) : సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 34వ వార్డులో రాజకీయ సందడి నెలకొంది. ఈ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా షేక్ జహీర్ గురువారం రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ వంటి హామీలు ఇప్పటికే అమలులో ఉన్నాయని చెప్పారు. వార్డు సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొంటూ, 'చేయి' గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు సిట్ నోటీసులు రాజకీయ కక్ష సాధింపే.. - ఉప్పు కృష్ణ

- కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని ఆరోపణ



చౌటుప్పల్, జనవరి 29 (తొలివెలుగు): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు పంపడం రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమేనని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వేధింపులకు పాల్పడుతూ కేసీఆర్ కుటుంబాన్ని అభాసుపాలు చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రతి ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉంటుందని, ఆ వ్యవస్థ అప్పటి ప్రభుత్వానికి విధిగా పనిచేసిందని ఆయన పేర్కొన్నారు. అయితే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు కోసం ప్రత్యేకంగా పనిచేసినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుత కల్పనలతో దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఈ ప్రచారం సహించరానిదని, తెలంగాణ సమాజం ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా ప్రగతి పథంలో నడిపారని ఉప్పు కృష్ణ గుర్తు చేశారు. 24 గంటల విద్యుత్ సరఫరా, సాగునీరు, తాగునీటి సమస్యల పరిష్కారం, వ్యవసాయ రంగంలో సాధించిన అద్భుతమైన ఫలితాలు నేటికీ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపారని అన్నారు. కేవలం రాజకీయ కక్షతో కేసీఆర్ కుటుంబంపై అబూత కల్పనలు సృష్టిస్తూ ఈ కేసు, ఆ కేసు అంటూ నోటీసులు పంపడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని విమర్శించారు. సిట్ అధికారులు నోటీసులు జారీ చేయడం వెనుక రాజకీయ కుట్ర కోణం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని పేర్కొన్న ఉప్పు కృష్ణ, ఇలాంటి పనికిరాని కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేసి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి సారించాలని హితవు పలికారు. కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసులకు వ్యతిరేకంగా మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

## కేసీఆర్‌పై సిట్ రాజకీయ కుట్ర - తుమ్మల వెంకటరెడ్డి

- మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కేసులు



వలిగొండ, జనవరి 29 (తొలివెలుగు) : మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ జాతిపిత కేసీఆర్‌పై సిట్ వేయడం రాజకీయ కుట్రలో భాగమేనని వలిగొండ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకటరెడ్డి ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. గురువారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పరిపాలనలో వైఫల్యాన్ని, ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులపై సిట్ పేరుతో కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. ఈ విధమైన చర్యలు దుర్మార్గమైనవని మండిపడ్డారు. స్వరాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించి, దశాబ్ద కాలం పాటు తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిపిన నాయకుడు కేసీఆర్ అని తుమ్మల వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఎన్ని కేసులు పెట్టినా కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ శ్రేణులు భయపడవని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఉద్యమానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని, రాష్ట్ర ప్రజలు ఈ రాజకీయ కుట్రను తగిన విధంగా తిప్పికొడతారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.